# దీపం  జ్యోతి

కావమ్మ కార్తీకమాసం దీపాలకి కృష్ణవొడ్డుకి బయలుదేరింది. డెబ్భై ఏళ్ళ ముదివగ్గు. అయితేనేం! అంత చలిలోనూ బుట్ట సర్దుకుని వొణక్కుండా, తొణక్కుండా చింతలరేవులో కొచ్చింది.

చిమ్మ చీకటి. చింతచెట్లమీద కబోది పక్షులు కొమ్మలకి కాళ్ళు వేళ్లాడేసి 'కీ' మని అరుస్తున్నాయి. అప్పటికే కొందరు ముత్తయిదువలు బండ రాళ్ళ మీద దీపాలు వెలిగిస్తున్నారు. కావమ్మ రేవులోకి రావటంతోటే, "ఓ పిన్నీ, ఓ అత్తా" అంటూ అందరూ పలకరించారు. ఆలస్యమయిందే అంటూ అంత చలిలోనూ కృష్ణలో తలస్నానం చేసి వచ్చి ఓ బండరాయి మీద కూర్చుని బుట్టలో సామాన్లు తీసుకుంటుంటే అక్కడ మరో రాయిమీద దుప్పటి కప్పుకు కూర్చున్న పార్వతి పిల్లలు 'మామ్మా! మేం అందిస్తాం' అంటూ బుట్టలోంచి సామాన్లు తీసి ఇచ్చారు.

రాయిమీద ముగ్గు వేసి, ఆవునేతి దీపారాధన చేసి, జాంపండు నివేదన చేసి

ధ్యానం చేసుకోటం మొదలెట్టింది కావమ్మ.

కావమ్మ ధ్యానం చేసుకుంటుంటే దీపం చుట్టూ నుంచున్నారు పార్వతి పిల్లలు ముగ్గురూను. వాళ్ళు నైవేద్యం పెట్టిన జామపండు కోసం ఎదురు చూస్తున్నారు. కళ్ళుతెరిచి చూస్తే ఆశగా చూస్తున్న పిల్లలు. "మీ సంగతి మరిచిపోయాన్రా" అని బోసిగా నవ్వి పిల్లలకి ప్రసాదం పెట్టింది కావమ్మ. మళ్ళీ దీపారాధనే చూస్తోంది. ఎంతకాలంనుంచి చేస్తోంది ఈ దీపారాధన! యాభైఏళ్ళనుంచి, ఈ గడ్డన కాపరాని కొచ్చినప్పటినుంచి దీపం వెలిగిస్తూనే వుంది. మొక్కుతూనే వుంది. దీపం అటూ ఇటూ వూగుతూనే వుంది. నవ్వుతూనే ఉంది. కాని తనని కరుణించలేదు. భర్త పోయాడు. కొడుకు పోయాడు. కోడలు పోయింది. తను మిగిలిపోయింది. ఈదీపం కోసమేనేమో! కాదు తనకంటి దీపం ఆ మనవడు, వాడికోసం. వాడు పట్నంలో కాలేజీలో చదువుతున్నాడు. వాడో ఇంటివాడైతే చూసి వెళ్ళిపోదామని.

తలెత్తి చూస్తే పార్వతి కనిపించింది. ముఖమంతా పసుపురాసుకుని పెద్ద కుంకంబొట్టుపెట్టుకుని, తలనీళ్ళు బొట్టు బొట్లుగా జుట్టులోంచి ముఖంమీద పడ్తుంటే ఓ చేత్తో తుడుచుకుంటూ దీపం వెలిగిస్తోంది. ఆవునేతి దీపం చిటపటలాడుతూ వెలుగుతుంటే, ఆ వెలుగులో పార్వతి ముఖాన్ని చూస్తూ, తన మనవడిపెళ్ళాంకూడ ఇలా వచ్చి దీపం వెలిగించుకుంటే ఎంత బావుండు అనుకుంది. ఆ ఊహకి కావమ్మకి కళ్ల నీళ్ళొచ్చాయి. ఆశ! ఈ ఆశ చావలేదు. అన్నీ పోయినా,కళ్ళు మసకలైనా దూరాన ఏదో తళుకు.

చీకటి విడిపోతోంది. ఆడవాళ్ళంతా దీపాలతో కృష్ణవొడ్డుకి వెళ్ళి మోకాళ్ళలోతుకి దిగి ఆవునేతి దీపాలు కృష్ణలో వదులుతున్నారు. కృష్ణనిండా దీపాలు. పాట పాడుతున్నట్లు ఆటూ ఇటూ వూగుతూ ప్రవాహంలో తేలిపోతున్నాయి. కొన్ని వందల ఆవునేతి దీపాలు. కృష్ణమ్మ ముత్యాల హారం ధరించినట్లు, ఆకాశం నక్షత్రాలు వర్షించినట్లు కృష్ణలో దివ్వెల బారులు.

వొడ్డున నుంచున్న పిల్లలు "మా అమ్మదీపం దేవుడి దగ్గర కెళ్తోందో"అని చప్పట్లు.

దూరం దూరంగా వెళ్తున్న దీప తోరణాన్ని చూస్తూ బొమ్మై నుంచుండి పోయింది కావమ్మ. "నా దీపం దేవుడిదగ్గర కెప్పుడెల్తుంది " అనుకుంటూ.

నీళ్ళు ముంచుకోటాని కొచ్చిన ముసలయ్య కావమ్మని చూసి పిడుగులాంటి వార్త చెప్పాడు. 'కావం పిన్నీ నిజమో, అబద్ధమో నాకు తెలియదు. కరణంగారు చెప్పారు. నీ మనవడు కులంగాని పిల్లని రిజిస్టరీ పెళ్ళి చేసుకున్నాడంట. ఇయ్యాళో రేపో వస్తాడంట' అని. కావమ్మ క్షణ కాలం బండరాయై పోయింది. తను ఎన్ని దుఃఖాలు మింగింది కాదు? అందులో ఇదొకటి. దూరంగా కృష్ణలో దీపాలు నిప్పుల్లా తేలినట్టు కన్పిస్తున్నాయి. గర్భానున్న బడబానలంపైకి నిప్పు కణికలు చిమ్మినట్లు కనిపిస్తోంది. కావమ్మ తన బుట్ట తీసుకొని గిరుక్కున తిరిగి వచ్చేసింది.

అన్నట్టుగానే మనవడు పెళ్ళికూతురితో రానే వచ్చాడు. మామ్మకి దణ్ణం పెట్టించాడు. పిల్ల బాగానే ఉంది. కాని, కావమ్మ మనసులో ఏదో మెలిక. ఊరంతా తిరిగి తిరిగి వచ్చారు దంపతులు. నాకు ఉపవాసం అని పండు తిని కావమ్మ పడుకుంటే వాళ్ళే ఏదో వండుకు తిన్నారు. రాత్రి కావమ్మకి నిద్ర పట్టలేదు.

పిల్ల ముఖం పార్వతి ముఖమంత కళగా వుంది. దీపమల్లేనే ఉంది. కాని కార్తీక దీపం పెడ్తుందో లేదో? తెల్లవారు జామున బుట్ట సర్దుకుంటూ "పిల్లా కృష్ణ స్నానానికి వస్తావా?" అంటే "అంతకంటేనా" అంది ఆ పిల్ల. ఇంకేమి! కావమ్మ పసిపిల్లలా సంబరపడింది.

కృష్ణ వొడ్డున పసుపురాసుకున్న ముఖంతో ఆ పిల్ల కార్తీకదీపం వెలిగించి కృష్ణలో వొదిలినప్పుడు కావమ్మ కళ్ళు చెమ్మగిల్లాయి. కృష్ణలో ముత్యాలవాన! రత్నాల మెరుపు! కృష్ణంతా వెన్నెల ! గుండెలో కోటి దివ్వెలు.

"దీపంకాదు దేవుడి దగ్గర కెళ్ళాల్సింది. ఇక నేనే వెళ్ళిపోవచ్చు." అనుకుంది కావమ్మ.*